క్లుప్తంగా

కళాత్మక శుభాకాంక్షలు



పొదలకూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మహ్మదాపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య కళాత్మకంగా శుభాకాంక్షలను తెలియజేశారు. కుంకుడు ఆకుపై జాతీయ పతాకాన్ని తీర్చిదిద్దారు.

తిరుమలకు మహాపాదయాత్ర



పొదలకూరు: పట్టణంలోని శ్రీదేవీ, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి 80 మంది భక్తులు తిరుమలకు పాదయాత్రగా శనివారం బయల్దేరారు. కార్యక్రమాన్ని తొమ్మిదేళ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన నిర్వాహకుడు అల్లూరు రమణయ్య, వాసు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకిసేవను నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా చక్రవర్తి, లలితా దంపతులు వ్యవహరించారు. స్వామివారు ప్రత్యేకాలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

సమస్యలపై వినతి

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని మంగలికట్ట జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజను కలిసి వినతి పత్రం అందజేశారు. తాగునీటి సమస్య, అప్రోచ్ రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు అధికంగా ఉన్నాయని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు.

పాఠశాలలో వసతుల తనిఖీ

మనుబోలు: స్థానిక చంద్రమౌళీనగర్ ప్రాథమిక పాఠశాలను డ్వామా పీడీ, సర్వేపల్లి నియోజకవర్గ నోడల్ అధికారి గంగాభవానీ ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఎంత మంది చదువుతున్నారు.. వీరిలో క్రమం తప్పకుండా ఎందరొస్తున్నారనే అంశాన్ని ఆరాతీశారు. పాఠశాలలోనే విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినేలా అవగాహన కల్పించాలని సూచించారు. కాగా పలువురు విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ కాకపోవడంతో వారి అపార్ నమోదు ఆలస్యమవుతోందని హెచ్‌ఎం అనంతయ్య పీడీ దృష్టికి తీసుకెళ్లారు. మండల వ్యాప్తంగా ఇదే సమస్య నెలకొందని, గిరిజన విద్యార్థులకు అపార్ నమోదు కాకపోవడంతో వారిని రాప్ బాక్స్‌లో పెట్టాల్సి వస్తోందని ఎంఈఓ రమేష్‌కుమార్ తెలియజేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చారు.

సమస్యల వలయంలో వసతిగృహాలు

- శిథిలావస్థకు చేరుతున్న భవనాలు
- పెచ్చులూడుతున్న స్లాబ్‌లు
- స్నానపు గదులకు తలుపుల కొరత

మనుబోలు: మండల కేంద్రంలోని రెండు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. జెడ్పీ హైస్కూల్ పక్కన ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహంలో స్లాబ్‌లు పెచ్చులూడుతున్నాయి. స్నానపు గదులకు తలుపులు సైతం లేవు. దీంతో ఇటీవల విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న బాలికల వసతిగృహాన్ని పిడూరు తూము వద్ద గల ఎస్సీ బాలుర వసతిగృహానికి.. బాలుర వసతిగృహాన్ని బాలికల వసతిగృహానికి మార్చారు. అయితే ప్రస్తుతం ఉన్న భవనంలోనూ పరిస్థితులు భిన్నంగా ఏమీ లేవని బాలికలు వాపోతున్నారు. ఇక్కడ వరండా అంతా దెబ్బతిని ఉంది. దోమల నివారణ కోసం కిటికీలకు ఏర్పాటు చేసిన మెష్‌లు ఊడిపోయాయి. వర్షమొస్తే వసతిగృహ మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలోకి నీరు చేరుతోంది.



బాలికల వసతిగృహం

మరింత అధ్వానంగా..

బాలుర వసతిగృహంలో వసతులు మరీ అధ్వానంగా మారాయి. స్నానపు గదులకు తలుపుల్లేవు. వంటశాల సైతం దెబ్బతిని ఉంది. దాదాపు అన్ని గదుల్లో పెచ్చులూడుతున్నాయి. కిటికీలు ఊడిపోయాయి. మరోవైపు పాఠశాలలు ప్రారంభమై ఏడు నెలలైనా, నేటికీ కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం చెల్లించలేదు. తాత్కాలిక మరమ్మతుల కోసం బాలికల వసతిగృహానికి రూ.8.5 లక్షలు, బాలుర వసతిగృహానికి రూ.ఐదు లక్షలు కేటాయించారని చెప్తున్నా, నేటికీ ఎలాంటి పురోగతి లేదు. వసతి గృహాలకు కొత్త భవనాలను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మెష్ ఊడిపోయిన కిటికీ



తలుపుల్లేని స్నానపు గదులు



పెచ్చులూడుతున్న స్లాబ్

దోమలతో నిద్ర కరువు



హాస్టల్ పక్కనే పంట కాలువ, గడ్డివాములు, ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. దీంతో రాత్రయితే దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. గదుల కిటికీలకు ఉండే మెష్‌లు దెబ్బతిన్నాయి. దోమల బెడదతో నిద్ర ఉండటంలేదు.

– వైష్ణవి, 8వ తరగతి

ఆర్నెల్లుగా కాస్మొటిక్ చార్జీల్లేవు



కాస్మొటిక్ చార్జీలను నేటికీ ఇవ్వలేదు. దీంతో సోపులు, పేస్టులు ఇతరత్రా ఖర్చులకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. తల్లిదండ్రులిచ్చే డబ్బుతోనే వీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది.

– గ్రీష్మ, ఏడో తరగతి

భయం.. భయంగా గడుపుతున్నాం



వసతిగృహంలో తరచూ పెచ్చులూడుతున్నాయి. దీంతో ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని భయం.. భయంగా గడుపుతున్నాం. వంట గది, స్నానపు గదులు సక్రమంగా లేవు. కొద్ది మంది విద్యార్థులే ఉండటంతో అద్దె భవనంలోకి మార్చేందుకు ఇంటిని కూడా చూశాం.

– సుధాకర్, వార్డెన్, బాలుర వసతిగృహం

ఘన నివాళి



వెంకటాచలం: మండలంలోని పుంజులూరుపాడు ఉప సర్పంచ్ మారు రఘురామిరెడ్డి మృతి చెందాడు. ఈ తరుణంలో గ్రామానికి మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం చేరుకొని పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, నేతలు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, రావి బాలకృష్ణపనాయుడు, నరసప్పనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, పేర్నేటి కాంబాబు రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

వెంకటాచలం: అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకుడు రాజ్‌కుమార్‌కు డాక్టరేట్‌ను వీఎస్‌యూ శనివారం ప్రదానం చేసింది. రవీంద్రనాథ్ టాగూర్ రచనలపై హ్యూమానిజం అండ్ సివిలైజేషన్ ఇన్ ది సెలెక్ట్ ప్రోజ్ వర్క్స్ ఆఫ్ రవీంద్రనాథ్ టాగూర్.. ఏ కాంటెంపొరరీ పర్‌స్పెక్టివ్ అనే అంశంపై వీఎస్‌యూలో ఆంగ్ల ప్రొఫెసర్ ప్రభాకర్ పర్యవేక్షణలో పరిశోధన సమర్పించారు. దీంతో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. రాజ్‌కుమార్‌కు పలువురు అభినందనలను తెలియజేశారు.

జంగంవానిదొరువులో పశువైద్య శిబిరం

ఇందుకూరుపేట : మండలంలోని జంగంవానిదొరువు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పశుగ్రాస పెంపకాలపై అవగాహన కల్పించారు. తొలుత పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను రైతులకు ఉచితంగా అందజేశారు.

గణాంకాల నమోదు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల గణాంకాలను శనివారం అధికారులు నమోదు చేశారు. ఈ సందర్భంగా మండల పంచాయతీల విస్తరణాధికారి నారాయణరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఇస్తున్నారా.. ఆహార రుచులను పరిశీలించినట్లు తెలియజేశారు. పాఠశాలలకు పూర్తిగా రాని వారి వివరాలను కూడా నమోదు చేశామన్నారు.

వ్యక్తి అదృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీలోని శాంతినగర్‌కు చెందిన ముకుడు ప్రకాష్(58) అనే వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి కథనం మేరకు.. సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి బుచ్చిరెడ్డిపాళేనికి కుమార్తెను చూసేందుకు వచ్చిన ఆయన ఈనెల 16వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఈ మేరకు అల్లుడు ఎమ్.వెంకటసురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిమ్మ యార్డులో గడ్డివామి దగ్ధం

పొదలకూరు: పట్టణంలోని నిమ్మ మార్కెట్ యార్డులో గడ్డివామి శనివారం దగ్ధమైంది. ఇక్కడి వ్యాపారులు నిమ్మకాయలను ప్యాకింగ్ చేసేందుకు గడ్డిని వినియోగిస్తారు. ఈ నేపథ్యంలో గడ్డిని కొనుగోలు చేసి వామి వేసుకుంటారు. ఈ తరుణంలో గుర్తుతెలియని వ్యక్తులు పొగతాగిన ముక్కలను వామి వద్ద వేసి ఉంటారని అనుమానిస్తున్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం : గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న నగర పంచాయతీ నూతన భవన పనులను వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బిత్రగుంట ప్రమీలమ్మ శనివారం పరిశీలించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గదులను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. త్వరగా పూర్తి చేయాలన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు: వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులను సాధించొచ్చని ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాళెంలో శనివారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో వరిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువులను అధికంగా వినియోగిస్తే తాలు గింజలు ఏర్పడటంతో పాటు దోమపోటుకు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఎలుకల నివారణకు బ్రోమోడైలిన్ మందుకు వినియోగించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, వీఏఏలు షర్మిల, విద్యాసాగర్, శివకుమార్, సుమంత్, ఏఈఓలు ప్రసన్న. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

ముత్తుకూరు: ప్రాజెక్టులకు కేంద్రంగా ఉన్న ముత్తుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడాన్ని నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు. ముత్తుకూరు స్టేషన్‌ను శనివారం సందర్శించి, సీసీ కెమెరాల పనితీరును స్క్రీన్‌పై పరిశీలించారు. నెల్లూరు.. కృష్ణపట్నం పోర్టు.. వెంకటాచలం వైపు ఏర్పాటు చేసిన 25 సీసీ కెమెరాల ద్వారా రికార్డయ్యే దృశ్యాలను పరిశీలించారు. కృష్ణపట్నం సీఐ రవినాయక్, ఎస్సైలు విశ్వనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డితో సమీక్షించారు. ఈ వ్యవస్థను ఎస్పీ చేతుల మీదుగా త్వరలో ప్రారంభించాలని నిర్ణయించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేయండి

తోటపల్లిగూడూరు: పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ ఉప్పల స్వర్ణలత సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పలు శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పంచాయతీల్లో మౌలిక వసతులు సక్రమంగా లేకపోతే గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని చెప్పారు. ఈ విషయంలో పంచాయతీ అధికారులు తగు జాగ్రత్తలు చేపట్టి గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు కనీస సౌకర్యాలను కల్పించాలని కోరారు.

అధికారుల గైర్హాజర్‌పై మండిపాటు

మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడంపై పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండిపడ్డారు. 21 శాఖల అధికారులకు గానూ 13 మందే హాజరయ్యారు. దీంతో అధికారుల తీరును నరుకూరు ఎంపీటీసీ సభ్యుడు కొణతం రఘుబాబు, కోవెరపాళెం సర్పంచ్ గంగపట్నం రమణయ్య ఎండగట్టారు. కోవెరపాళెంలో ప్రభుత్వ నిధులతో కాలువ పూడికతీత పనులను చేపడితే స్థానిక టీడీపీ నేతలు తమ సొంత నిధులంటూ ప్రచారం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పంచాయతీకి అవసరమైన నిత్యావసర సేవల విషయమై పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

పొదలకూరు: కుష్టు వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వివరించేందుకు వీలుగా ఉంటుందని జిల్లా పారా మెడికల్ అధికారి మోహన్‌రావు పేర్కొన్నారు. కుష్టువ్యాధిపై అవగాహన సదస్సును స్థానిక కాకతీయ జూనియర్ కళాశాలలో ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎవరికైనా లక్షణాలుంటే వైద్య సిబ్బందికి సమాచారమివ్వాలని కోరారు. ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, శివప్రసాద్, సుమాంజలి, ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహన్‌రావు

చట్టాలపై పరిజ్ఞానం పెంచుకోవాలి

కొడవలూరు : మహిళలు వారి హక్కులు, చట్టాలపై పరిజ్ఞానం పెంచుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి కె.వాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆమె హాజరై, మాట్లాడారు. మహిళల కోసమే ప్రత్యేకంగా న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోవూరు సీనియర్ సివిల్ జడ్జి పి.చైతన్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆస్తులను పిల్లలు తీసుకుని వారిని చూసుకోకుంటే ఆ ఆస్తిని తిరిగి తీసుకునేందుకు చట్టం ఉందన్నారు. న్యాయవాదులు శివకామేశ్వరి, రోజా, వి.రాంబాబులు రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు.



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వాణి

ఓటును సద్వినియోగం చేసుకోండి

తోటపల్లిగూడూరు: ఓటు వజ్రాయుధమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటపల్లిగూడూరులో ర్యాలీని తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది జరిపారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. మండల గణాంకాధికారి రామ్‌ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ శివయ్య, ఆర్‌ఐ ద్వారకానాథ్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, వెంకటేష్, సురేష్, సిబ్బంది అశ్విని తదితరులు పాల్గొన్నారు.

➡ **వెంకటాచలం:** ప్రజాస్వామ్యంలో ఓటు కీలక పాత్ర పోషిస్తోందని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్‌రావు పేర్కొన్నారు. కాకుటూరు సమీపంలోని వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటును తప్పక వినియోగించుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, ప్రిన్సిపల్ విజయ, ఎన్నెస్సెస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

➡ **మనుబోలు:** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఉప తహసీల్దార్ బషీర్ కోరారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం వసంతకుమారి, రీ సర్వే ఉప తహసీల్దార్ మంజుల, ఆర్‌ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు: ఓటర్లకు సత్కారం

యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

కోవూరు : యువత ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించేందుకు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ప్రవేశపెట్టారని తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ మురళీ అన్నారు. మండల కేంద్రమైన కోవూరులో విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమన్నారు. తహసీల్దార్ నిర్మలానంద బాబా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

➡ **కొడవలూరు** : ఓటు హక్కు పొందడంతో పాటు తప్పక వినియోగించుకోవాలని తహసీల్దార్ కె.స్ఫూర్తి సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కొడవలూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులందజేసి మాట్లాడారు. అర్హత వచ్చాక ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్ కె.వెంకయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, వీఆర్వో శ్రీనివాసరావు, సీఓ అమర్నాథ్‌రెడ్డి, జూనియర్ సహాయకులు అశ్విని, స్థానిక నాయకులు రమణయ్య, కోవూరు వెంకీ, అంబటి విజయ్‌కుమార్, చింతా ప్రభాస్ పాల్గొన్నారు.



కోవూరులో అవగాహన ర్యాలీ

➡ **విడవలూరు** : స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు పి.ప్రియాంక, వైస్ ప్రిన్సిపల్ ఎన్.మధు, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

➡ **బుచ్చిరెడ్డిపాళెం** : తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుచ్చిలో శనివారం ర్యాలీ నిర్వహించారు. తొలుత రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లను సన్మానించారు.